## సీఎంఆర్ఎఫ్ నిబంధనలు కఠినతరం..

- మంజూరు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే
- చెక్కుల సవరణలో మ్యాన్యువల్‌కు చెక్
- వివరాలు పక్కాగా ఉండాలి
- తాజా మార్గదర్శకాలను జారీ చేసిన సర్కార్






జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం


## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట








# అడ్మిషన్ల వేట

-ఇంటర్‌లో నాణ్యమైన విద్య, ర్యాంకుల పేరుతో గాలం- తల్లిదండ్రులను మభ్యపెడుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలు

పదో తరగతి ఫలితాలు ప్రకటించడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్ లో అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. తమ కళాశాలలో నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పేరుతో అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టాయి. ఏఐలో అదనంగా శిక్షణ ఇస్తామని విద్యార్థుల తల్లిదండ్రుల చుట్టూ, కళాశాల యాజమాన్యాలు, అధ్యాపకులు తిరుగుతున్నారు. నాణ్యమైన విద్య, ప్రతిభ గల అధ్యాపకులతో బోధన, ఏసీ గదులు, డే స్కాలర్స్‌కు ప్రత్యేక బస్సులు పేరుతో ప్రచారం చేస్తున్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించడ మే లక్ష్యమని తల్లిదండ్రులను కళాశాల నిర్వాహకులు మభ్యపెడుతున్నారు.

అడ్మిషన్ల కోసం వేలకు వేలు జీతాలు ఇస్తూ పీఆర్‌వో వ్యవస్థను నడిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు సైతం, పిల్లల ఉన్నత భవిష్యత్ కోసం ప్రైవేట్, కార్పొరేట్ కళాశాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు తల్లిదండ్రుల బలహీనతలను ఆసరా చేసుకొని పెద్దమొత్తంలో ఫీజులు నిర్ణయిస్తున్నాయి. మార్కులు, ఎంట్రన్స్, ఫీజుల రాయితీ పేరుతో విద్యార్థులను, తమ

### హన్వాడ పోలీస్ స్టేషన్‌లో జిల్లా

# ఎస్పీ వార్షిక తనిఖీలు

**- నిష్పక్షపాత విధులు, ప్రజలకు సత్వర సేవలపై దిశానిర్దేశం**

హన్వాడ / మహబూబ్‌నగర్, మే 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదివారం సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు,



### చీటింగ్ మోసాల పట్ల ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి

- -తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మొద్దు.
- -తెలియని వ్యక్తులకు డబ్బులు, వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు
- -మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- -నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట ప్రతినిధి మే 31 (ప్రజా జ్యోతి)** ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బంగారం, స్థలాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, లక్కీ డ్రాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, సులభంగా లోన్,



# సీఎంఆర్ఎఫ్ నిబంధనలు కఠినతరం..

దుర్వినియోగానికి చెక్
ఇలాంటి ముఖ్యమంత్రి సహాయ నిధి కొన్ని చోట్ల దుర్వినియోగం అవుతున్నట్లు, సహాయనిధి బాధితులకు అందడంలో జాప్యం జరుగుతున్నట్లు, ఒక ప్రాంతం వారు మరో ప్రాంతం నుంచి ఈ సీఎంఆర్ఎఫ్ పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. మంత్రులు ఇతర నియోజకవర్గాల పరిధిలోని బాధితులకు సీఎంఆర్ఎఫ్?ను సిఫార్సు చేయడం వల్ల స్థానిక ఎమ్మెల్యే ప్రాధాన్యత తగ్గిపోతోంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధిపై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నది.
ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కొత్త మార్గదర్శకాలను పాటించడం తప్పనిసరి చేసింది. తాజాగా ఆన్‌లైన్ దరఖాస్తు విషయంలోనూ కొన్ని మార్పులను చేసింది. నిధులదుర్వినియోగాన్ని అడ్డుకుని పారదర్శకతను పెంపొందించేందుకు నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఈమేరకు ప్రభుత్వంతాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ఎఫ్ కింద అర్హులను ఎంపిక చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మంత్రుల సిఫార్సులు చెల్లవు
మంత్రులు ఇక నుంచి ఇతర నియోజకవర్గాలకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం సిఫార్సు చేయడం కుదరదు. జిల్లాలోని ఏ నియోజకవర్గానికి చెందిన వారికైనా మంత్రులు ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేసే అవకాశం ఇప్పటి వరకు ఉంది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఆవిధానం మారింది. మంత్రులు లేదా ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గ పరిధిలో నివసించే అభ్యర్థులకు మాత్రమే సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తు సాఫ్ట్‌వేర్‌లో కూడా అభ్యర్థి చిరునామా ఆధారంగానే సిఫార్సు చేసేలా మార్పులు చేశారు. ఈ కొత్త విధానం వల్ల అనర్హుల దరఖాస్తులకు అడ్డుకట్టపడే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.
సీఎంఆర్ఎఫ్ చెక్కుల్లో ఏవైనా తప్పులు దొర్లితే గతంలో మాన్యువల్ విధానం అమల్లో ఉండేది. ఇకపై మార్పుల ప్రక్రియను పూర్తిగా ప్రజాప్రతినిధుల లాగిన్‌కు అనుసంధానించారు. లబ్ధిదారులు తమ నియోజకవర్గ ప్రజాప్రతినిధి కార్యాలయాన్ని ఆశ్రయిస్తే అక్కడి సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా రెవెన్యూ విభాగానికి దరఖాస్తు పంపిస్తారు. అనంతరం కొత్త చెక్కు నేరుగా ప్రజాప్రతినిధి కార్యాలయానికి చేరుతుంది.

పక్కాగా వివరాలు
నిరుపేదల కోసం ప్రభుత్వం అందించే ముఖ్యమైన ఆర్థిక సహాయం కొన్ని కారణాల వల్ల జాప్యం జరుగుతుందని చెబుతున్న ప్రభుత్వం.. వివరాలన్నీ పక్కాగా ఇవ్వాలని సూచించింది. దరఖాస్తుదారులు ఇచ్చేవివరాల్లో తప్పులు దొర్లితే ఆర్థిక సాయం అందడంలో జాప్యం జరుగుతోందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సెల్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు తప్పుగా ఇవ్వడం, ఆధార్ సంఖ్య నమోదులో తప్పులు, వాస్తవ ధ్రువపత్రాలు సకాలంలో సమర్పించకపోవడం వంటి కారణాలతో చెక్కులు లబ్ధిదారులకు సకాలంలో చేరడం లేదని ప్రభుత్వం గుర్తించింది. వివరాల న్నీ పక్కాగా ఉండేలా చూడాలని పేర్కొన్నది. ఫిజికల్ డాక్యుమెంట్లు సమయానికి సమర్పించకపోవడం వంటి అనేక తప్పిదాలు జరుగుతున్నాయని వీటన్నిటినీ సరిగ్గా చూసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజాప్రతినిధులకు సూచించింది.

దరఖాస్తు ఇలా..
ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకునేవారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఒరిజినల్ మెడికల్ బిల్లులు, హాస్పిటల్ డిశ్చార్జ్ సమ్మరీ, చికిత్స అంచనా కాగితాలు, లబ్ధిదారుడి బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, నియోజకవర్గ ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ సంతకంచేసిన సిఫార్సు లేఖ తప్పనిసరిగా ఉండాలి. ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్, ఫొటో, ఫోన్ నెంబర్ అందజేయాలి.

రెండు రకాలుగా సాయం
సీఎంఆర్ఎఫ్ సాయాన్ని ప్రభుత్వం రెండు రకాలుగా అందజేస్తోంది. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో చికిత్స కోసం ముందుగా చెల్లింపులు అవసరం లేకుండా ప్రభుత్వం లేఖ ఇస్తోంది. ఈ లేఖలో మంజూరు చేసిన నగదును చెల్లించకుండానే రోగి చికిత్స పొందవచ్చు. ఇక ఏదైనా ప్రభుత్వం లేదా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన రోగి బిల్లు మొత్తం చెల్లించిన తర్వాత అందులో కొంత భాగా న్ని తిరిగి ఇవ్వాలని ఈ నిధికి దరఖాస్తు చేసుకోవచ్చు.

## హన్వాడ పోలీస్ స్టేషన్‌లో జిల్లా

# ఎస్పీ వార్షిక తనిఖీలు

ఎఫ్ఐఆర్ నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, ఆన్‌లైన్ అప్‌డేట్స్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి కేసును సమయానుకూలంగా నమోదు చేసి సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఎస్పీ సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత పెంపొందించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసుల దర్యాప్తు వరకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఇచ్చిన ఆదేశాలను సిబ్బందికి వివరిస్తూ, నిష్పక్షపాత విధులే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ అంశాలను కూడా ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సూచించారు.
పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బందే ప్రజలకు ఆదర్శంగా ఉండాలని పేర్కొంటూ, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చే సిబ్బందిని పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
అనంతరం స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్న సిబ్బంది ప్రతి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి నేరుగా తనను కలవవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా, రూరల్ సీఐ గాంధీ నాయక్, హన్వాడ ఎస్ఐ వెంకటేష్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




23mm f/1.88

## అడ్మిషన్ల వేట

కళాశాల వైపు మళ్లించుకుంటున్నాయి. గ్లోబల్స్ ప్రచారంలో పడి, తల్లిదండ్రులు మోసపోవద్దని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థి సామర్థ్యం, కళాశాల నిర్వహణ, గత ఫలితాలు, పోటీ పరీక్షల్లో రాణించిన విద్యార్థులు, సాధించిన సీట్లు పరిగణలోకి తీసుకొని, అడ్మిషన్ తీసుకోవాలంటున్నారు. ప్రభుత్వం ముందస్తు అడ్మిషన్లు చేపట్టే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బ్యాచుల పేరుతో అధిక ఫీజులు
కార్పొరేట్ విద్యాసంస్థలు కొన్ని మెరిట్, స్టార్, స్టార్–1, స్టార్–2 బ్యాచ్ పేరుతో ఫీజుల నిర్ణయిస్తున్నాయి. ఏసీ క్యాంపస్, నాన్‌ఏసీ పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నాయి. గతంలో వచ్చిన ర్యాంకులను పదేపదే ప్రచారం చేస్తూ తల్లిదండ్రులు ఆకర్షిస్తున్నారు. ప్రత్యేక బ్యాచ్ పేరుతో తల్లిదండ్రులను నమ్మ బలుకుతున్నారు. వారి మాటలను నమ్ముతున్న తల్లిదండ్రులు, తమ పిల్లల సామార్థ్యాన్ని గమనించకుండా లక్షలాది ఫీజులు చెల్లిస్తున్నారు.

లక్షల్లో ఫీజులు

కార్పొరేట్ విద్యాసంస్థల్లో మెరిట్ బ్యాచ్‌కు(హాస్టల్‌తో కలిపి) రూ. 140లక్షలు, స్టార్ బ్యాచ్‌కి రూ. 1.60లక్షలు, స్టార్–1కు రూ. 1.80 లక్షలు, స్టార్–2కు రూ. 2లక్షల వరకు ఫీజుల వసూలు చేస్తున్నారు. అదనంగా మరో రూ. 26వేలు ఇతరాత్ర ఫీజులు. ఇంటర్ రెండు సంవత్సరాలు పూర్తిచేయడానికి ఒక్కో విద్యార్థిపై తల్లిదండ్రులు రూ. 3లక్షల నుంచి రూ. 4.50లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రయాణ ఖర్చులు అదనం. అదే విధంగా జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలో సైతం దే స్కాలర్స్ రూ. 25నుంచి రూ. 40వేల వరకు ఉంది. కొన్ని కళాశాలలో రూ. 50వేల నుంచి రూ. లక్షవరకు ఉంది. హాస్టల్ అయితే రూ. 80నుంచి రూ. 2లక్షల వరకు ఉంది.

కనిపించని ప్రభుత్వ నిబంధన
ముందస్తు అడ్మిషన్లు చేయకూడదన్న జీవో ఉన్నప్పటికీ, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు పీఆర్వో వ్యవస్థ ద్వారా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయి. రంగు, రంగు బ్రోచర్లు, పీఆర్వోలతో అడ్మిషన్లు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. పది పరీక్షలు ముగియక ముందే అడ్మిషన్ల కోసం వేట, ముందుగానే సీటు రిజర్వేషన్ చేసుకుంటే ఫీజులో రాయితీ కల్పిస్తామని చెబుతున్నట్లు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండ పోయిందంటున్నారు. .

## చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తక్షణ ఉద్యోగం, లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలను నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు. ఇటీవల కొందరు ఫేక్ డాక్యుమెంట్లు, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి స్థలాలు, ఇళ్లు అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, అధికారిక ధృవీకరణ తీసుకున్న తర్వాతే లావాదేవీలు చేయాలని సూచించారు.
అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం, ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం, ??= కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు.
విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంస్థలను మాత్రమే సంప్రదించాలని, ముందస్తుగా డబ్బులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలు బంగారం, చిట్‌ఫండ్స్, ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు.
ప్రజలు ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, మోసగాళ్లను చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారుప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట వేయగలదు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు

# శివ భక్తులకు ఆహ్వానం



**కొల్లాపూర్ మే 31 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ పట్టణ పరిధిలో ఉన్న అన్నపూర్ణ అపరేశ్వర స్వామి దేవస్థానం దగ్గర కొత్తగా తయారు చేసిన రథం, కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలు గా ప్రసిద్ధి చెందిన శివాలయం శివపార్వతులకు రథోత్సవం ఆలయ కమిటీ. ఎప్పటినుండో రాజుసురభి రాజ్యపాలనలో శ్రీ అన్నపూర్ణ అమరేశ్వర స్వామి వారి దేవాలయము నందు ఎంతో పేరు ప్రఖ్యాతలు గడిచిన శివ పార్వతుల దేవాలయం. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఏ దేవాలయం దగ్గర లేని ఎత్తులో మన కొల్లాపూర్ శివాలయం దగ్గర (తేరు)రథం ఉండెను. ఇది దాదాపుగా 50 నుండి 60 సంవత్సరాల క్రితం ఎంతో అంగరంగ వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలను, పట్టణంలో శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేది అని చరిత్ర చెబుతుంది. దాతల సహకారంతో శిథిలావస్థకు చేరుకున్న కొల్లాపూర్ శివాలయమునుసర్వాంగ సుందరంగా ఆలయ కమిటీ తీర్చిదిద్దుకుంటున్నాము. శిథిలమైన రథం(తేరు) స్థానంలో శ్రీ అన్నపూర్ణ అమరేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కాల్వగడ్డ ప్రభాకర్ శెట్టి 20 లక్షల రూపాయల, వ్యయంతో 23 అడుగుల ఎత్తులో 10 అడుగుల వెడల్పులో నూతన తేరు అన్నపూర్ణ అమరేశ్వర స్వామి వారి కమిటీ ఆధ్వర్యంలో చేయుటకు ఆరు లక్షల రూపాయలు అడ్వాన్స్ గా ఆలయ కమిటీకి ఇచ్చారు.అట్టి రథోత్సవము పట్టణ పురవీధుల గుండా బయలుదేరుటకు ప్రధాన అడ్డంకిగా విద్యుత్ వైర్లు ఉన్న. విద్యుత్తు లైను తేరు బయలుదేరు వీధుల గుండా రెండు వైపులా ఏర్పాటు చేయుట కొరకు కొల్లాపూర్ పురపాలక సంఘము చైర్ పర్సన్ ఉ వైస్ చైర్మన్ మరియు కార్యవర్గమునకు వినతి పత్రం అందించుట కొరకు గాను రేపు అనగా సోమవారం రోజున ఉదయం 11 గంటలకు శివమాలదారులు 100 మంది మరియు గతంలో శివమాల ధరించిన శివభక్తాదులు అందరు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి అంగరంగ వైభవంగా జరిగే శివరాత్రి మహోత్సవాలకు రథోత్సవానికి విజయవంతంగా జరుగుట కొరకు ఈ సామాజిక మాధ్యమ ప్రకటనను ఆహ్వానంగా భావించి తప్పనిసరిగా శివాలయం దగ్గరికి తరలి రావలసిందిగా ఆలయ కమిటీ విజ్ఞప్తి.అన్నపూర్ణ అమరేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి కమిటీ కొల్లాపురం.

# రజక సంఘ నూతన నాయకులకు ఘన సన్మానం

## - రాష్ట్ర వాషర్ మ్యాన్ కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన స్వాగతం



మహబూబ్‌నగర్, మే 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : మహబూబ్‌నగర్ నగరంలోని న్యూ టౌన్ ప్రాంతంలో రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర వాషర్ మ్యాన్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్ కుమార్, వైస్ చైర్మన్ బంగారు బాబులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ సంజీవ్ ముదిరాజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఓబెదుల్లా కొత్వాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ ఆనంద్ కుమార్ గౌడ్, చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధు, రజక సంఘ నాయకుడు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రజక సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో పద్మావతి కాలనీలోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సభలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రజక సంఘ సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకులు తమ పదవీకాలంలో రజక వర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రజక సంఘ ఐక్యత, అభివృద్ధికి ఈ కార్యక్రమం వేదికగా నిలిచిందని, నాయకులు మరియు కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# చెన్నై పోటీల్లో తెలంగాణ జట్ల ప్రతిభ

## - మహిళల జట్టుకు తొలి స్థానం
## - పురుషుల జట్టుకు రన్నరప్ ఘనత

**మహబూబ్‌నగర్, మే 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**

చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్లు అద్భుత ప్రతిభ కనబరిచాయి. రాష్ట్ర జట్టు కెప్టెన్ ఎన్. కృష్ణ నాయకత్వంలో మహిళల జట్టు తొలి స్థానం సాధించగా, పురుషుల జట్టు రెండవ స్థానాన్ని కైవసం చేసుకోవడం అభినందనీయమని పలువురు నాయకులు ప్రశంసించారు. రాష్ట్ర జట్టు తరఫున శ్రీను, నవీన్, దివాకర్, వెంకటేష్, పరమేష్, రామ్ చరణ్, దుర్గా సాయి, సాయిరాం, శివ, ఈశ్వర్, గౌతమ్ తదితర క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో తెలంగాణ జట్టు తొలి మ్యాచ్‌లో పుదుచ్చేరిపై 7-0 తేడాతో ఘన విజయం సాధించింది. అనంతరం కేరళ జట్టును 6-2తో ఓడించింది. మరో మ్యాచ్‌లో తమిళనాడుపై 5-1 తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జట్ల మధ్య హోరాహోరీ పోరు సాగగా, చివరికి ఏపీ జట్టు 4-2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో తెలంగాణ పురుషుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, సత్తూరు చంద్రకుమార్ గౌడ్, ప్రవీణ్ టెన్ని, జహీర్ అక్తర్, మక్సుద్, మహమ్మద్ రియాజ్ తదితరులు రాష్ట్ర జట్టు కెప్టెన్ ఎన్. కృష్ణను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.




# దామరగిద్ద పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నరేష్




**నారాయణపేట ప్రతినిధి మే 31 (ప్రజా జ్యోతి)**

దామరగిద్ద పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (రాూ)గా ఎస్సై నరేష్ ఆదివారం ఉదయం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

ఇంతకుముందు జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ)లో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై దామరగిద్ద పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కాగా, దామరగిద్ద ఎస్సైగా పనిచేసిన ఎస్సై పి. రాజు బదిలీపై మక్తల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై నరేష్ మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ [illegible] గారి ఆదేశాల మేరకు దామరగిద్ద మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాల అమలు, గ్రామాల్లో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు సత్వర సేవలు అందించే దిశగా కృషి చేస్తామని ఎస్సై నరేష్ వెల్లడించారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై నరేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వనపర్తిలో జూన్ 5-7 వరకు బీజేపీ జిల్లా స్థాయి శిక్షణ శిబిరం

## - 250 మంది నాయకులతో 13 సెషన్లు.. ప్రారంభానికి రాష్ట్ర అధ్యక్షుడు హాజరు

**వనపర్తి, మే 31 (ప్రజాజ్యోతి):**

భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా వనపర్తి జిల్లాలో జూన్ 5, 6, 7 తేదీల్లో జిల్లా స్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ అధ్యక్షతన శిక్షణ శిబిరం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా శిక్షణ ప్రభారి గిరమోని శ్రీనివాసులు మాట్లాడుతూ, ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో విజయవంతంగా మండల స్థాయి శిక్షణ శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 5 నుంచి 7 వరకు జిల్లా కేంద్రంలోని నాగవరం సూర్యచంద్ర ప్యాలెస్ స్కూల్‌లో జిల్లా స్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సుమారు 250 మంది జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. మూడు రోజులపాటు వివిధ అంశాలపై 13 సెషన్లు నిర్వహించనున్నట్లు, ప్రతి సెషన్‌కు బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ప్రధాన వక్తలుగా హాజరవుతారని చెప్పారు. శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ప్రారంభించి నాయకులకు మార్గనిర్దేశం చేయనున్నారని, ముగింపు కార్యక్రమానికి జాతీయ స్థాయి నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబి రెడ్డి వెంకట్ రెడ్డి, మున్నూరు రవీందర్, మాజీ జడ్పీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, కేతూరి బుడ్డన్న, బి. శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌ను బొంద పెట్టడానికి ప్రజలు గ్రామాలలో సిద్ధంగా ఉన్నారు

## ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ కారంగి బ్రహ్మయ్య



**కొల్లాపూర్ మే 31 ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం పెంట్లవెల్లి మండల కేంద్రం లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల జేఏసీ జిల్లా కన్వీనర్ కారంగి బ్రహ్మయ్య ప్రెస్ మీట్ సమావేశంలో మాట్లాడారు చిన్న కాంట్రాక్టర్లకి ఇచ్చిన నిధులు టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి అని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన ఈ జీవో 17 రద్దయ్యే వరకు బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకుమా పోరాటం ఆపేది లేదు.2028లో తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రభుత్వమే వస్తుంది. ఆ ప్రభుత్వం లో 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతాంమని ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీల జేఏసీ జిల్లా కన్వీనర్ కారంగి బ్రహ్మయ్య మాట్లాడారు,
మొన్న జరిగిన ఇందిరా పార్క్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ కాంట్రాక్టర్ల మహాధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పై మాట్లాడారు. ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్. అధికారం లోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని మా ప్రియతమ నాయకుడు కేటీఆర్ ప్రజా పాలన ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.
ఎన్నికల ముందు చేవెళ్ల కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం (మొత్తం 72 శాతం) రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ అధికారం లోకి వచ్చాక 72 శాతం కాదు గదా, 72 పైసలు కూడా ఈ వర్గాలకు ఇవ్వకుండా అడ్డగోలు జీవోలను తెచ్చారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, చికెన్, పాలు, బ్రెడ్ వంటి వాటిని కూడా దక్కకుండా చేస్తూ 'జీవో నెం.17' (+ూ 17) తీసుకువచ్చి, ఆ టెండర్లను పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన ఈ జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కేవరకు పోరాటం ఆపేది లేదని జిల్లా కన్వీనర్ కారంగి బ్రహ్మయ్య మాట్లాడారు.ఇవాళ రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని రేవంత్ రెడ్డి బామ్మర్దికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే అన్ని కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు. సొంత నియోజకవర్గం కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ. 4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని రాష్ట్ర ప్రభుత్వా న్ని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కేవలం వాళ్ల బంధువులకే కాకుండా బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని అందులో రూ. 4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని జిల్లా కన్వీనర్ బ్రహ్మ య్య ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు మరియు చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్‌కు ఉందా అని మొన్న జరిగిన సభలో మా ప్రియతమ నాయకుడు కేటీఆర్ డిమాండ్ చేశారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన ఒక రెగ్యులర్ సీఎం కాదని కేవలం రెన్యూవల్ సీఎం అని మాట్లాడారు మాట్లాడారు . ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌కు నెలనెలా కప్పం (డబ్బులు) పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, ఢిల్లీకి బ్యాగులు మోసుకుంటూ పోయినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణా బడుగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఢిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్ రెడ్డితో పాటు రాహుల్ గాంధీని మల్లికార్జున ఖర్గేని కూడా నిలదీయాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ గారు సంపద సృష్టించాలి-పేదలకు పంచాలి అనే దృక్పథంతో పనిచేశారన్నారు. నాడు చిన్న చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుని గౌరవంగా నిలబెట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పులు చేసి 1000కి పైగా గురుకులాలు కట్టించి 6.50 లక్షల మంది బడుగు విద్యార్థులకు ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షల నుండి రూ.1.25 లక్షల వరకు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, బూట్లు బట్టలు నాణ్యమైన భోజనం అందించారని ఎస్సీ ఎస్టి బీసీ మైనార్టీల జిల్లా కన్వీ నర్ కారంగి బ్రహ్మయ్య పేర్కొన్నారు. అప్పులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని జిల్లాకో మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీ తెచ్చారని 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్, 15 లక్షల మంది ఆడబిడ్డలకు మేనమామ కట్నంగా కళ్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించారని ఆయన తెలిపారు. రైతులకు రూ.72 వేల కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ముఖం బాగాలేక అద్దం పగులగొట్టుకున్న చందంగా. తాము చేతగాక కేసీఆర్ అప్పులు చేశాడని రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. హద్దుమీరి మాట్లాడితే ఊరుకునేది లేదని తెలంగాణ తెచ్చిన మహానుభావుడు కేసీఆర్ అని యావత్ తెలంగాణ రాష్ట్ర గర్వంగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలో మక్కలు వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో గ్రామాలలో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై ధ్వజమెత్తారూ. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో
ఎలక్షన్లు ఎప్పుడు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాతపెట్టి బొంద పెట్టాలని గ్రామాలలో ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మొన్న జరిగిన మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వదిలిపెట్టకుండా పోరాటం చేసి బాధిత కుటుంబానికి అండగా నిలిచారని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు, బడుగు వర్గాల సమస్యలపై అధికారులకు మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని ఒకవేళ వాళ్ళు వినకపోతే భవిష్యత్తులో జంతర్ మంతర్ లేదా ఢిల్లీ వేదికగానైనా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల జేఏసీ పోరాడుతామన్నారు. 2028లో తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని నాడు 10 వేల మంది కాదు దాదాపు 50 వేల మంది బడుగు బలహీన వర్గాల యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ తీసుకుంటారని అభయమిచ్చారు.

## రజకుల అభ్యున్నతికి సీఎం రేవంత్ రెడ్డి కృషి

### దాసరి రాజు అజయ్ కుమార్

### - 15 ఏళ్ల తర్వాత వాషర్ మెన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ పునరుద్ధరణ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

మహబూబ్‌నగర్, మే 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : తెలంగాణ రాష్ట్రంలో రజకుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని తెలంగాణ వాషర్ మెన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దాసరి రాజు అజయ్ కుమార్ అన్నారు. దాదాపు 15 ఏళ్లుగా మూతపడిన వాషర్ మెన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్‌ను తిరిగి ప్రారంభించి రజకుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. రజక కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా మహబూబ్‌నగర్‌కు వచ్చిన అజయ్ కుమార్ నేరుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుని తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బేక్కరి మధుసూదన్ రెడ్డి, చంద్రకుమార్ గౌడ్, ఎల్లంగారి భరత్ కుమార్, చంద్రమౌళి, కౌన్సిలర్ ఉమర్ కొత్వాల్ తదితరులతో భేటీ అయ్యారు. అజయ్ కుమార్ రాక సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రజక సంఘ నాయకులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకుని పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన వాషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీని 15 ఏళ్ల తర్వాత తిరిగి ప్రారంభించిందని గుర్తు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రజకుల సంక్షేమాన్ని విస్మరించిందని, కార్పొరేషన్‌ను మూసివేసి రజకుల జీవితాలతో చెలగాటమాడిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతూ రజకుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం టీఎన్జీవో కార్యాలయంలో దుర్గేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు అజయ్ కుమార్ హాజరై మాట్లాడారు.




# కృష్ణ మండలంలో మూడు ప్రీ ప్రైమరీ స్కూళ్లకు అనుమతి

## మండల విద్యాధికారి నిజాముద్దీన్




(ప్రజా జ్యోతి) మే/31/2026
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే లక్ష్యంతో తీసుకువచ్చిన ప్రీ ప్రైమరీ పాఠశాలలను కృష్ణ మండలంలో ముడుమాల,హిందూపూర్,కున్సీ గ్రామాలకు మంజూరైనట్లు పేర్కొన్నారు.జూన్ 12 నుండి 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అడ్మిషన్లు కల్పించి ఆట పాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశానుసారం తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రీ ప్రైమరీ తరగతులను సద్వినియోగం చేసుకోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చుటకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని ఒక ప్రకటనలో తెలియజేశారు...

# పాముకాటుకు గురైన మహిళను పరామర్శించిన మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి



**మిడ్జిల్/ మహబూబ్‌నగర్, మే 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
మిడ్జిల్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకుడు మల్లేష్ తల్లి వారం క్రితం పాముకాటుకు గురై మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న డాక్టర్ లక్ష్మారెడ్డి వైద్యులతో మాట్లాడి బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే ఆస్పత్రి ఆర్ఎంఓ, సూపరింటెండెంట్‌తో మాట్లాడి చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ డాక్టర్ కోడుగల్ యాదయ్య, రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ శ్రీనివాసులు, మూడా డైరెక్టర్ ఇమ్ము, మిడ్జిల్ మండల పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు పాండు యాదవ్, మాజీ జడ్పీటీసీ శశిరేఖ బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ.హెచ్.ఎస్ ప్రీమియం విధ్యను పి.ఆర్.టియు సంఘం ఖండిస్తుంది

## -పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు లక్ష్మి నారాయణ

నాగర్ కర్నూల్ : మే 31(ప్రజా జ్యోతి)
ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు నుంచి జుూా ఎంప్లాయ్ హెల్త్ స్కీం కొరకు ఎటువంటి గైడ్లైన్స్ లేకుండా ఆస్పత్రులతో ఒప్పందం చేసుకోకుండా భార్యాభర్తల విషయంలో స్పష్టమైన ఆదేశాలు లేకుండా,లబ్ధిదారుల నుండి ఎలాంటి అనుమతి లేకుండ మే నెల వేతనము నుండి సబ్స్క్రిప్షన్ చేయడం అత్యంత దుర్మార్గ చర్యగా తెలంగాణ [illegible] సంఘం భావిస్తుందని ఇది పూర్తిగా ఏక పక్షంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని దీనిని అందరూ ఉపాధ్యాయులు ముక్త కంఠంతో తో ఖండించాలి ఈ విషయం లో తెలంగాణ [illegible] సంఘం కార్యాచరణకు సిద్ధం అవుతుందని జిల్లా
అధ్యక్షుడు లక్ష్మినారాయణ,జిల్లా ప్రధానకార్యదర్శి సాయిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మయూరి ఎకో పార్క్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు

**- డిజిటల్ టికెటింగ్ వ్యవస్థతో సందర్శకులకు మెరుగైన సేవలు**

**మహబూబ్‌నగర్, మే 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
గౌరవనీయులు శివ్ ఆశిష్ సింగ్, ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు మయూరి ఎకో పార్క్ పరిసర ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్క్ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, వాటిని సక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మయూరి ఎకో పార్క్‌లో ఎటువంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని, వాటిని ఉల్లంఘించే వారిపై సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
అలాగే సందర్శకులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు మయూరి ఎకో పార్క్‌లో డిజిటల్ టికెటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సందర్శకులు మీ టికెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పార్క్ ప్రవేశ టికెట్లు మరియు ఇతర అందుబాటులో ఉన్న టికెట్లను




ఆన్‌లైన్ ద్వారా సులభంగా బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత పార్క్ నిర్మాణంలో ప్రతి సందర్శకుడు భాగస్వామి కావాలని, పరిశుభ్రమైన మరియు హరిత వాతావరణ పరిరక్షణకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మహబూబ్‌నగర్‌కు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్న షైన్ స్కిన్ కేర్ సెంటర్ ఏషియన్ న్యూరో సెంటర్





**చర్మం, జుట్టు, సౌందర్య వైద్యం మరియు న్యూరాలజీ సేవలు ఒకే చోట**

**మహబూబ్‌నగర్, మే 31 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
మహబూబ్‌నగర్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో షైన్ స్కిన్ కేర్ సెంటర్ & ఏషియన్ న్యూరో సెంటర్ స్థాపించబడ్డాయి. ఈ సంస్థలను డా. జి.వి.కె.ఆర్. గౌడ్, డా. వాసు చైతన్య, డా. కళ్యాణి కరణం మరియు మురళీ కృష్ణ స్థాపించారు. చర్మం, జుట్టు, సౌందర్య వైద్యం మరియు న్యూరాలజీ రంగాల్లో ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే వీరి ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రజలకు కూడా మెట్రో నగరాల్లో లభించే అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఈ సంస్థలు అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు మరియు రోగి-కేంద్రిత సేవలతో ముందుకు వచ్చాయి.

షైన్ స్కిన్ కేర్ సెంటర్ ప్రత్యేకతలు :
మహబూబ్‌నగర్ జిల్లాలో తొలిసారిగా ఆధునిక చర్మ, జుట్టు మరియు సౌందర్య వైద్య సేవలను అందించేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేయబడింది.
అందుబాటులో ఉన్న సేవలు:
డెర్మటాలజీ (చర్మ వైద్యం)
ట్రైకాలజీ (జుట్టు వైద్యం)
కాస్మెటిక్ మరియు ఏస్థెటిక్ చికిత్సలు
లేజర్ చికిత్సలు
హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలు
స్కిన్ మరియు హెయిర్ అనాలిసిస్
యాంటీ-ఏజింగ్ చికిత్సలు
అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు

ఏషియన్ న్యూరో సెంటర్ ప్రత్యేకతలు :
ఏషియన్ న్యూరో సెంటర్‌లో సమగ్ర న్యూరాలజీ మరియు న్యూరో సర్జరీ సేవలు అందుబాటులో ఉన్నాయి.
ఇందులో:
24/7 న్యూరో ఐసీయూ సేవలు
న్యూరో అవుట్ పేషెంట్ సేవలు
న్యూరో డయాగ్నస్టిక్ ల్యాబ్ (ఈ ఈ జి, ఎన్ సి ఎస్ & ఈ ఎన్ ఎం జీ )
అత్యాధునిక మెదడు మరియు వెన్నెముక శస్త్రచికిత్సలు
సమగ్ర న్యూరాలజీ పరీక్షలు మరియు చికిత్సలు
న్యూరో క్రిటికల్ కేర్ సేవలు
ఒకే చోట సమగ్ర వైద్య సేవలు :
రోగులకు డెర్మటాలజీ, ట్రైకాలజీ, సౌందర్య వైద్యం మరియు న్యూరాలజీ నిపుణుల సేవలు అందుబాటులో ఉండటంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాల చికిత్సా విధానాలు అమలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొటిమలు, పిగ్మెంటేషన్, మెలాస్మా, జుట్టు రాలడం, హెయిర్ రిస్టోరేషన్, యాంటీ-ఏజింగ్ చికిత్సలు, ఆధునిక లేజర్ విధానాలు, న్యూరాలజీ నిర్ధారణ మరియు క్రిటికల్ కేర్ సేవలను సమగ్రంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భారతీయ చర్మ మరియు జుట్టు లక్షణాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన చికిత్సా ప్రణాళికలు రూపొందిస్తూ, అత్యున్నత భద్రత, పరిశుభ్రత మరియు రోగి సంరక్షణ ప్రమాణాలను పాటిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండటంతో ప్రజలు పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. షైన్ స్కిన్ కేర్ సెంటర్ & ఏషియన్ న్యూరో సెంటర్ మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక వైద్య సేవల విస్తరణలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తున్నాయని, ప్రజలు తమ కుటుంబాలకు సమీపంలోనే ప్రపంచ స్థాయి వైద్య సేవలను పొందేలా కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడిగా బిల్లకంటి హరిబాబు ఎన్నిక

నాగర్ కర్నూల్ : మే 31 (ప్రజా జ్యోతి)
ఆర్యవైశ్య మహాసభ నాగర్ కర్నూల్ పట్టణ అధ్యక్షుడిగా బిల్లా కంటి హరిబాబు 135 ఓట్ల మెజార్టీతో ఆయన ప్రత్యర్థి వాసా రమేష్ పై విజయం సాధించారు.ఆదివారం నాగర్కర్నూల్ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో ఎన్నికను నిర్వహించారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది.ఆర్యవైశ్య మహాసభ జిల్లా కన్వీనర్ మాచిపెద్ది శివకుమార్,ఎన్నికల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది.హోరాహోరీగా సాగిన ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలలో బిల్ల కంటి హరిబాబు విజయం సాధించారు.



# ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి నేటి కార్యక్రమాల వివరాలు

**నాగర్ కర్నూల్ :మే 31 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి నేటి సోమవారం (01.06.2026) రోజు నియోజకవర్గ పర్యటన వివరాలు.ఉదయం 08:30 గంటలకు తాడూరు మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు.09:30 గంటలకు నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర గ్రామం లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ,ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు.11:00 గంటలకు బిజినపల్లి మండల కేంద్రంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు.11:30 గంటలకు నాగర్ కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామం లో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొంటారు.మ:
12:30 గంటలకు తెల్కపల్లి మండల కేంద్రంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం లో పాల్గొంటారు.సాయంత్రం 05:00 గంటలకు మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొంటారు.పై
కార్యక్రమాలకు మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్,మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్,పట్టణ పార్టీ అధ్యక్షులు,యూజా చైర్మన్లు/డైరెక్టర్ లు,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,వార్డు కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు,వార్డు సభ్యులు నియోజకవర్గంలోనిఆయా మండలాల పార్టీ ప్రెసిడెంట్లు,కార్యవర్గ సభ్యులు,సర్పంచ్ లు,మాజీ జడ్పీటీసీలు,మాజీ ఎంపీపీ లు,మాజీ ఎంపీటీసీ లు,మాజీ సర్పంచ్లు, పార్టీ అధ్యక్షులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనగలరని ఎమ్మెల్యే కోరారు.

# అగ్ని వీర్ కి సెలెక్ట్ అయిన కోటకొండ నిరుపేద విద్యార్థి అరవింద్



**నారాయణపేట ప్రతినిధి మే 31 (ప్రజా జ్యోతి**
నారాయణపేట మండలం కోటకొండ గ్రామానికి చెందిన మంగలి వెంకటేష్, తల్లి సరోజ దంపతుల పెద్ద కొడుకు అరవింద్ ఇంటర్మీడియట్ చదువుతూ చదువులో ముందుంటూ చదువు మీద శ్రద్ధతో ఒకపక్క బీఎస్సీ నర్సింగ్ అవకాశం ఉన్న దేశభక్తితో ఆర్మీలో చేరాలని సంకల్పంతో, ఆర్థిక స్తోమతకు మించి ఉన్న కొడుకు పట్టుదల ఇంట్రెస్ట్ తో ఉండడంతో తల్లిదండ్రులు భారంగా అనుకోకుండా కోచింగ్ పంపియ్యడం జరిగింది అరవింద్ కూడా తల్లిదండ్రుల నమ్మకాన్ని ఏమాత్రం చేయకుండా ఈరోజు సెలెక్ట్ దేశసేవ కోసం సెలెక్ట్ కావడం తమకు గర్వకారణం అని తల్లిదండ్రులు ఆనంద పడుతున్నారు, కోటకొండ గ్రామ ప్రజలు తోటి మిత్రులు రాజకీయ ప్రముఖులందరూ అరవిందును అభినందిస్తున్నారు చిన్న వయసులోనే దేశ సేవ కోసం సెలెక్ట్ కావడం నిజంగా గ్రామం తరఫున గొప్ప విషయమని భవిష్యత్తులో దేశ సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలని వారు అరవింద్ నీ అభినందిస్తున్నారు,

## రామాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

నాగర్ కర్నూల్ : మే 31 (ప్రజా జ్యోతి)నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో అధిక జ్యేష్ఠ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం 8 మంది దంపతులచే నిర్వహించిన సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు శాస్త్రోక్తంగా వేద మంత్ర చరణల మధ్య నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు.సూక్ష్మంలో మోక్షమార్గం పొందుటకు ప్రతి హిందూ కుటుంబం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని తప్పనిసరిగా ఆచరించాలని స్వామివారి కృపా కటాక్షాలు పొందుటకు ఉన్నంతలో స్వామివారి వ్రతాలు చేయాలని సూచించారు.అనంతరం వేద ఆశీర్వచనం,తీర్థ ప్రసాదాల పంపిణీ చేసి పాల్గొన్న భక్తులు రామాలయం అన్నప్రసాద కమిటీ వారిచే సామూహిక అన్న ప్రసాదాన్ని భక్తులందరికీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అర్థం రవీందర్,మల్లేష్,శ్రీను,యాదగిరి,నందకిశోర్,గొల్లరాములు,ప్రదీప్,శిరీష,రవ రాదేవి యాదమ్మ, భాగ్యమ్మ,భక్తులు పాల్గొన్నారు.



# పెద్దమారూర్ గ్రామంలో ఘనంగా ముగిసిన పీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్

**-చెడు వ్యసనాలకు దూరంగా.. క్రీడలకు దగ్గరగా ఉండాలి : ఎస్సై రామన్ గౌడ్**

**-యువత క్రీడలతోనే ఉన్నత శిఖరాలకు చేరాలి :మోత్కూర్ పోలీస్ ఇన్స్పెక్టర్ చక్కెర వెంకటేశ్వర్లు**

**విజేతగా శ్రీకృష్ణ టీమ్ -- రూ.10 వేల నగదు బహుమతిని ప్రాథమిక పాఠశాలకు విరాళంగా ప్రకటించిన క్రీడాకారులు**





**చిన్నంబావి, మే 31 (ప్రజాజ్యోతి)**
చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో గత మూడు రోజులుగా ఉత్సాహభరితంగా సాగిన పీపీఎల్ (ప్రీమియర్ క్రికెట్ లీగ్) టోర్నమెంట్ ఆదివారం అత్యంత వైభవంగా ముగిసింది. గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రికెట్ పోటీలు క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా, అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీకృష్ణ టీం విజేతగా నిలిచి రూ.10,000 నగదు బహుమతిని కైవసం చేసుకుంది. రెండవ బహుమతి జాంబవ యూత్ జట్టు రూ.5,000 నగదు బహుమతిని గెలుచుకుంది.టోర్నమెంట్ ముగింపు వేడుకలకు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, స్థానిక ఎస్సై రామన్ గౌడ్, మోత్కూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) చక్కెర వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజేతగా నిలిచిన శ్రీకృష్ణ టీమ్ సభ్యులు తమకు లభించిన రూ.10 వేల నగదు బహుమతిని పెద్దమారూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం సభలోని అందరి ప్రశంసలను అందుకుంది. క్రీడల ద్వారా సామాజిక సేవకు ముందుకు రావడం యువతలో ఉన్న మంచి మనసుకు నిదర్శనమని పలువురు అభినందించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కేతపాగ జయమ్మ లక్ష్మయ్య మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం యువతలో ఐక్యత, క్రమశిక్షణ, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువత తమ సమయాన్ని క్రీడలకు కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని సూచించారు. గ్రామ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని, క్రీడల్లో రాణించడంతో పాటు విద్యా రంగంలోనూ ముందుండాలని ఆకాంక్షించారు. విజేతలు ప్రైజ్ మనీని పాఠశాలకు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని, ఇది ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. చిన్నంబావి మండల స్థానిక ఎస్సై రామన్ గౌడ్ మాట్లాడుతూ క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉంచుతాయని అన్నారు. నేటి యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న నేపథ్యంలో క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మైదానంలో క్రీడాకారులు ప్రదర్శించిన క్రీడాస్ఫూర్తి అభినందనీయమని కొనియాడారు. గెలుపోటములు సహజమని, ఓటమిని కూడా విజయానికి నాందిగా స్వీకరించే మనస్తత్వం అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి యువకుడు రోజూ కొంత సమయం వ్యాయామం లేదా క్రీడలకు కేటాయించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు.మోత్కూరు సీఐ చక్కెర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కావని, అవి వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపొందనకు పునాది అని పేర్కొన్నారు. మైదానంలో నేర్చుకునే క్రమశిక్షణ, సమయపాలన, జట్టు భావన జీవితాంతం ఉపయోగపడతాయని అన్నారు. గెలిచిన జట్లు వినయంతో ఉండాలని, ఓడిన జట్లు నిరుత్సాహపడకుండా మరింత కష్టపడి భవిష్యత్తులో విజయాలను అందుకోవాలని సూచించారు.యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం లభిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువత ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్‌తో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు రాజ్‌కుమార్, లోకేష్, గ్రామ సర్పంచ్ కేతపాగ జయమ్మ--లక్ష్మయ్య, ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, స్థానిక ఎస్సై రామన్ గౌడ్, మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంతరావు, రామచందర్ (టీచర్), మధు (టీచర్), జగ్గారి శ్రీధర్ రెడ్డి, నరేందర్ గౌడ్, చక్కెర మహేష్, భగవంత్ రెడ్డి, గద్దం శ్రీనివాసులు ప్రజాప్రతినిధులు, యువకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. విజేతల సత్కారం అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించగా, పెద్దమారూర్ క్రీడా మైదానం ఆనందోత్సాహాలతో మార్మోగిపోయింది.

# మైనర్ బాలిక మృతిపై కేసు నమోదు

**నిందితుడు అరెస్ట్: నారాయణపేట సీఐ శివశంకర్**

**నారాయణపేట ప్రతినిధి మే 31 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న మైనర్ బాలిక మృతి ఘటనకు సంబంధించి నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నారాయణపేట సీఐ శివశంకర్ తెలిపారు.
వివరాల ప్రకారం, జిల్లా కేంద్రానికి చెందిన ఒక మైనర్ బాలికను పైజల్ అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మాయమాటలు చెప్పి తనకు అనుకూలంగా ప్రవర్తించాడని, అనంతరం పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన బాలిక తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు.ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. కేసును అత్యంత ప్రాధాన్యంతో విచారించి, నిందితుడు పైజల్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని చెప్పారు.మైనర్లపై జరిగే నేరాల విషయంలో జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ప్రజలు తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు లేదా వేధింపుల విషయాలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.
కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

# వడదెబ్బతో వ్యక్తి మృతి



**నారాయణపేట ప్రతినిధి మే 31 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పక్‌పల్లి గ్రామ శివారులో ఒక వ్యక్తి వడదెబ్బ కారణంగా మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు నీరటి చంద్రయ్య (48), తండ్రి నీరటి ఎర్ర సాయప్ప, ధన్వాడ మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అప్పక్‌పల్లి గ్రామ శివారులో అపస్మారక స్థితిలో ఉండగా స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.ప్రాథమిక విచారణలో తీవ్ర ఎండల ప్రభావంతో వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.మృతుడి వివరాలను గుర్తించిన అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.
ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోందని రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి తెలిపారు.

# తెలుగు సినీ పరిశ్రమకు మార్గదర్శి కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు



**చిన్నంబావి, మే 31 (ప్రజా జ్యోతి)**
తెలుగు సినీ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిన సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా కొప్పునూర్ ఇంచార్జి వసతిగృహ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో కృష్ణ జీవితంలోని మరపురాని ఘట్టాలను గుర్తు చేసుకున్నారు."అల్లూరి సీతారామరాజు" సినిమా చూసిన తర్వాత తాను కృష్ణ అభిమానిగా మారానని తెలిపారు. కృష్ణ కేవలం వెండితెరపై హీరో మాత్రమే కాకుండా నిజ జీవితంలోనూ రియల్ హీరోగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజలకు ఎక్కడ ఏ విపత్తు వచ్చినా ముందుగా స్పందించి ఉదారంగా సహాయం అందించేవారని కొనియాడారు.తెలుగు సినీ పరిశ్రమకు ఈస్ట్‌మన్ కలర్, సినిమా స్కోప్, స్టీరియోఫోనిక్ సౌండ్ వంటి ఆధునిక సాంకేతికతలను పరిచయం చేసి కొత్త దిశను చూపించిన ఘనత కృష్ణదేనని అన్నారు. నిర్మాతలు నష్టపోకుండా తన పారితోషికాన్ని తిరిగి ఇచ్చిన ఉదార స్వభావం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని తెలిపారు.క్లాస్, మాస్ అనే తేడా లేకుండా అత్యధిక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందిన కృష్ణ, సినీ పరిశ్రమలోనే కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ ముందుండేవారని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు వేలాది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు చేయించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు.కుమార్తె మంజుల సినీ నటి, నిర్మాతగా, కుమారుడు సూపర్ స్టార్ మహేష్ బాబు అగ్రనటుడిగా రాణించడం కృష్ణ కుటుంబ విలువలకు నిదర్శనమని అన్నారు. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ హీరోగా నిలిచిన కృష్ణ వంటి మహానుభావులు అరుదని పేర్కొన్నారు.తెలుగు సినీ పరిశ్రమకు ఆయన లేని లోటు ఎప్పటికీ తీరనిదని, సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**ఘనంగా టీజేఎఫ్ రజతోత్సవ ముగింపు వేడుకలు**

**పేట మున్సిపల్ పార్కు ముందు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు కొవ్వొత్తుల ర్యాలీ**

**నారాయణపేట ప్రతినిధి మే 31 (ప్రజా జ్యోతి)**
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని టీయూడబ్ల్యూజే హెచ్ 143 ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యులు వారధి నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షులు ఆనంద్‌కుమార్ గౌడ్, టెంజు జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ లు పేర్కొన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టీజేఎఫ్) ఏర్పాటు అయి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రజతోత్సవ ముగింపు వేడుకలను జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర జర్నలిస్టులు ఘనంగా జరుపుకున్నారు.
ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకురావడంలో టీజేఎఫ్ వ్యవస్థాపకుడు అల్లం నారాయణ సార్ కీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణ ఉద్యమానికి మీడియా వేదికగా నిలిచిన జర్నలిస్టులు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ఉద్యమ విజయానికి తమ వంతు కృషి చేశారన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అల్లం నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం టీజేఎఫ్ నిరంతరం కృషిచేస్తోందన్నారు.రజతోత్సవ వేడుకలు జర్నలిస్టుల ఐక్యతకు, ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచాయని, భవిష్యత్తులోనూ వృత్తి గౌరవాన్ని కాపాడుకుంటూ సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.
ఈ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు అంబదాస్ టక్,శ్రీధర్ సర్గం,మిస్కిన్ వినోద్, రఫీ, నారాయణ, రాము, వెంకటేష్,కర్లీ దేవి ప్రసాద్, జహీర్ సోఫీ,మొహ్మద్ హుస్సేన్,మొహ్మద్ అష్రఫ్,హాజరుద్దీన్,తాహెర్ , పలువురు జర్నలిస్టులు, టీజేఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

